సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం ၊ 8 ၊ జూలై ၊ 2025



శిక్షణ ప్రారంభం 8లో

ప్రశాంతి నిలయంలో సత్యసాయి విద్యా సంస్థలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి.



కొనసాగుతున్న వరద

తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో 52,566, అవుట్‌ఫ్లో 61,677 క్యూసెక్కులు ఉంది. 19 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని నదికి వదులుతున్నారు.

గరిష్టం/కనిష్టం
31.0°/21.1°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

చాక్లెట్ ఇవ్వలేదని తిట్టినందుకు మహిళ హత్య!

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గీతానగర్‌కు చెందిన మహిళ మృతి కేసులో చిక్కుముడి వీడినట్లు తెలుస్తోంది. చాక్లెట్ ఇవ్వలేదని తిట్టినందుకే ఎదురింటిలోని వ్యక్తి ఆమెను కడతేర్చినట్లు సమాచారం. వివరాలిలా ఉన్నాయి. రమాదేవి (55) అనే మహిళ గీతానగర్‌లో ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఆమె ఎదురింట్లో ఉంటున్న రాజశేఖర్ కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా జూన్ 29న వార్డులోని వారికి చాక్లెట్లు పంచేందుకు పంపించాడు. అయితే అందరికీ పంచి చివరగా ఎదురింట్లో ఉన్న రమాదేవికి చాక్లెట్ ఇవ్వబోతే ఆమె తీసుకోకపోగా బాలుడి తండ్రిని దూషించింది. దీంతో రాజశేఖర్.. రమాదేవి ఇంటికెళ్లి గొడవపడ్డాడు. ఈ క్రమంలో కోపంలో కిందకు తోయడంతో స్పృహ కోల్పోయిన రమాదేవిని.. టవల్‌తో గొంతు బిగించాడు. ఆమె మృతి చెందిందనుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత స్థానికులు గమనించి ఆమెను ఆస్పత్రిలో చేర్చారు. అప్పటి నుంచి రాజశేఖర్ ఆస్పత్రిలోనే ఎక్కువగా ఉంటూ ఆమె ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆరా తీస్తుండేవాడు. పరిస్థితి విషమించి ఈ నెల నాలుగో తేదీన రమాదేవి మృతి చెందింది. పోస్టుమార్టం వరకు కూడా అతను ఆస్పత్రిలో హడావుడిగా తిరిగాడు. అనంతరం సీఐ నాగేంద్రప్రసాద్ ఆమె మృతిపై వార్డులో విచారణ చేపట్టారు. అనుమానితుడి కింద రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో రాజశేఖర్ ఆమెను చంపినట్లు అంగీకరించారని తెలుస్తోంది. అయితే పోలీసులు ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు. మరో రెండు రోజుల్లో కేసు వివరాలు, నిందితుడి అరెస్టు గురించి వెల్లడించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

గంజాయి ముఠా గుట్టురట్టు

రాయదుర్గం: గంజాయి తరలిస్తున్న ముఠా గుట్టును రాయదుర్గం పోలీసులు రట్టుచేశారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి కేంద్రంగా సాగిస్తున్న ఈ దందాలో పది మంది నిందితులు పట్టుబడ్డారు. సోమవారం అర్బన్ పీఎస్‌లో కేసుకు సంబంధించిన వివరాలను సీఐ జయనాయక్ వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు రాయదుర్గం రైల్వేస్టేషన్ పరిసరాల్లో ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని కణేకల్లు రైల్వే బ్రిడ్జివద్ద తనిఖీలు చేయగా .. కంబదూరు మండలం కర్తనపర్తి, కొత్తూరు, చెన్నంపల్లి గ్రామాలకు చెందిన బోయ నరేష్, కొడిపల్లి రామాంజినేయులు, ఎరుకుల మారన్న, ఆత్మకూరు మండలం తోపుదుర్తి కి చెందిన చిటమ్మరప్ప, అనంతపురం మండలం పూలకుంటకు చెందిన కంటగాని వెంటకరాముడు, అనంతపురం పట్టణానికి చెందిన దంపట్ల జీవన్‌కుమార్, ఇమామ్‌సాబ్, షేక్ అన్వర్‌బాష, గార్లదిన్నె మండలం పాతకల్లుకు చెందిన అంచెల రసూల్‌ఖాన్ నుంచి 1.709 కిలోల గంజాయితో పట్టుబడ్డారన్నారన్నారు. వారి నుంచి గంజాయితో పాటు ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో ముఠాగా ఏర్పడి కొంతకాలంగా గంజాయి వ్యాపారం చేస్తున్నారన్నారు. బళ్లారి రైల్వేస్టేషన్, బస్టాండు ప్రాంతాల్లో ఉన్న సాధువుల దగ్గర కిలో రూ.25 వేలతో కొనుగోలు చేసి అక్కడి నుంచి రైలులో ఏపీలోకి దిగుమతి చేస్తున్నట్లు చెప్పారు. వాటిని చిన్న పాకెట్లుగా మార్చి ఒక్కో పాకెట్ రూ.800కు విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారన్నారు. ఎస్పీ జగదీష్‌తో పాటు డీఎస్పీ రవిబాబు సీఐతో పాటు వారి సిబ్బందిని అభినందించారు.



బత్తలపల్లిలో ఊరేగుతున్న పెద్ద ఖాసీంస్వామి పీరు

భక్తజన సంద్రం

బత్తలపల్లిలో పీర్ల భేటీ తిలకించేందుకు విచ్చేసిన ప్రజలు



బత్తలపల్లిలో పీర్ల భేటీ

- నలుమూలల నుంచి తరలివచ్చిన జనం
- పీర్ల భేటీని తిలకించి పరవశించిన వైనం

బత్తలపల్లి: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొహర్రం ఉత్సవాలకు ప్రసిద్ధిచెందిన గూగూడు కుళ్లాయిస్వామి తర్వాత బత్తలపల్లి మండల కేంద్రంలో పెద్ద ఖాసీం, చిన్న ఖాసీం స్వామి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో పదో రోజైన సోమవారం బత్తలపల్లిలో పీర్ల భేటీ ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని పోట్లమర్రి, గంటాపురం, వేల్పుమడుగు, రాఘవంపల్లి, ఈదుల ముష్టూరు, మల్కాపురం గ్రామాల పీర్లు తెల్లవారుజాము నుంచే ఊరేగింపుగా మండల కేంద్రానికి చేరుకున్నాయి. పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం కూడలిలో బత్తలపల్లి చిన్న ఖాసీం, పెద్ద ఖాసీం స్వామి పీర్లతో భేటీ అయ్యాయి. ఆ తర్వాత బత్తలపల్లిలోని చావిడి వద్దకు వెళ్లి చదివింపులు చేశారు. భేటీ సమయంలో భక్తులు బెల్లపు ఉంటలను పీర్లపైకి విసిరి మొక్కులను తీర్చుకున్నారు. నలుమూలల నుంచి తరలివచ్చిన అశేష భక్తజనంతో బత్తలపల్లి జనసంద్రంగా మారిపోయింది. రోడ్లపై వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. మేడలు, భవనాలపైకి ఎక్కి ప్రజలు భేటీని తిలకించారు. హిందువులు, ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని మతసామరస్యాన్ని ప్రదర్శించారు. డప్పులు, తప్పెట్ల మోతలు, ఈలలు, కేకలతో పరిసర ప్రాంతాలు హోరెత్తిపోయాయి. భక్తులకు పలువురు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్, 70 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. తరలివచ్చిన జనసందోహాన్ని కట్టడి చేశారు. భేటీల అనంతరం పీర్లు ఆయా గ్రామాలకు తరలివెళ్లగా, బత్తలపల్లి అగ్నిగుండం దగ్గర జంతుబలులు గావించారు. సాయంత్రం గ్రామం చివర వరకు పీర్లను తీసుకెళ్లి జలధి నిర్వహించారు. ఈ ఘట్టం చివర అంకానికి చేరుకోవడంతో రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. ఆడ, మగ భేదం లేకుండా అందరూ భక్తిశ్రద్ధలతో అలావ్ తొక్కారు. అనంతరం ఆల్‌బిదాయో...అంటూ విషాద గీతం ఆలపిస్తూ మకాన్‌కు చేరుకున్నారు. బత్తలపల్లిలో మాత్రమే సోమవారం జలధి నిర్వహించారు. మిగిలిన గ్రామాల్లో మంగళవారం జలధి నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు తెలిపారు. ఇదిలా ఉండగా సంజీవపురం, మాల్యవంతం పంచాయతీలలో సోమవారం పెద సరిగెత్తు వేడుకలను నిర్వహించారు. మంగళవారం భేటీ వెంకటగారిపల్లి సత్రం వద్ద ఉంటుందన్నారు. సాయంత్రం జలధి నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.



బత్తలపల్లిలో ఊరేగుతున్న వివిధ గ్రామాల పీర్లు



బత్తలపల్లి పీర్లుతో భేటీ తీసుకుంటున్న పీర్లు

34 ఏళ్ల తర్వాత భేటీకి వచ్చిన మల్కాపురం పీర్లు




బత్తలపల్లిలో ఊరేగింపుగా వెళ్తున్న మల్కాపురం గ్రామ పీర్లు

మొహర్రం ఉత్సవాల్లో 34 ఏళ్ల తర్వాత ధర్మవరం మండలం మల్కాపురం పీర్లు భేటీ కోసం బత్తలపల్లికి వచ్చాయి. గతంలో మండలంలోని 24 గ్రామాల పీర్లు వెంకటగారిపల్లి సత్రం వద్ద భేటీ అయ్యేవి. 1992లో అక్కడ అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోవడం వల్ల భేటీకి కొన్ని గ్రామాల పీర్లు వెళ్లడం లేదు. అప్పటి నుంచి మల్కాపురం పీర్లు కూడా భేటీకి వెళ్లడం లేదు. ఇప్పుడు బత్తలపల్లి కూడలిలో సోమవారం జరిగిన భేటీకి ఆ గ్రామానికి చెందిన పీర్లు రావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. మల్కాపురంలో గ్రామోత్సవం అనంతరం పోట్లమర్రికి చేరుకున్న పీర్లకు ఇక్కడ పీర్లు ఘనస్వాగతం పలికి భేటీ తీసుకున్నారు. అక్కడ నుంచి బత్తలపల్లి కూడలికి రెండు గ్రామాలకు చెందిన పీర్లు తరలివచ్చాయి.

జన హృదయ నేత వైఎస్సార్

- లక్షలాది మందికి పునర్జన్మనిచ్చిన ఆరోగ్యశ్రీ
- అనంతరం 108, 104 పథకాలు అమల్లోకి తెచ్చిన మహానేత
- కరువుతో అల్లాడుతున్న సమయంలో అనంతకు వైఎస్ ఆసరా
- జిల్లాలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చింది వైఎస్సారే
- రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, పేదలకు ఇందిరమ్మ ఇళ్లతో ఊరట
- అద్భుత పథకాల ఆవిష్కర్త డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి నేడు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఒక పథకం దేశం కాదు ప్రపంచం దృష్టినే ఆకర్షించడం సామాన్య విషయం కాదు. ఏకంగా ప్రపంచబ్యాంకు, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వంటి సంస్థలు ఆరోగ్యశ్రీని పొగిడాయంటే ఈ పథకం ఎలాంటిదో అంచనా వేయొచ్చు. ఆరోగ్యశ్రీ.. ఈ పథకం పేరు వినగానే దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గుర్తుకు వస్తారు. దేశవ్యాప్తంగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా పథకాల రూపకర్తగా సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.

ఆరోగ్యశ్రీ పురుడు పోసుకుంది అనంతలోనే

2004 సంవత్సరానికి ముందు ఉమ్మడి అనంతపురం జిల్లా అత్యంత కరువు ప్రాంతం. పదిరూపాయలు పెట్టి వైద్యం కూడా చేయించుకోలేని దుస్థితి. ఇలాంటి సమయంలో మొదటి దశలో అనంతపురం జిల్లాలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. ఇక్కడే పథకం పురుడు పోసుకుంది. అనంతపురంతో పాటు మహబూబ్‌నగర్, శ్రీకాకుళంలో ఒకేరోజు ఈ పథకాన్ని ప్రారంభించారు. 168 వ్యాధులతో ప్రారంభమైన ఈ పథకం తర్వాత 958 చికిత్సలకు వైద్యం అందించింది. ఈ పథకం ద్వారా పేదలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం పొందారు. పుట్టుకతోనే చెవిటి మూగ ఉన్న పిల్లలకు ఒక్కొక్కరికి రూ.6 లక్షలు వెచ్చించి కాక్లియర్ ఇంప్లాంట్స్ వేయించిన ఘనత వైఎస్సార్‌దేనని అందరికీ తెలిసిందే.

108, 104 పథకాలు...

ఆపదలో నేనున్నానంటూ కుయ్ కుయ్‌మంటూ వచ్చే 108 వాహనాల రూపకర్తా వైఎస్సారే. ప్రమాదంలో గాయపడి నిస్సహాయ స్థితిలో ఉండే వేలాదిమందికి ఈ వాహనాలే ప్రాణభిక్ష పెట్టాయి. రాత్రనకా పగలనకా ఏ సమయంలో పిలిచినా పలికే ఈ వాహనాల పథకాన్ని వైఎస్సార్ సృష్టించారు. ఈ పథకం ఆ తర్వాత దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలూ అమలు చేశాయి. వైద్య సలహాల కోసం 104 పథకాన్నీ రూపొందించారు. 104కు ఫోన్ చేస్తే చాలు వైద్య సలహాలు అందేవి. వైఎస్సార్ హయాంలో రైతులకు ఉచిత విద్యుత్, పంట రుణాల మాఫీ, పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూర్చారు. ఆయన ప్రవేశపెట్టిన పథకాల ద్వారా లబ్ధిపొందిన ప్రజలు ఇప్పటికీ ఆయన్ను గుర్తు చేసుకుంటూనే ఉన్నారు.

దార్శనికుడు వైఎస్సార్

జిల్లాలో కరువు నివారణలో భాగంగా సాగు - తాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిన దార్శనికుడు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి. 2004లో ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక తాగునీటి పథకంగా ఉన్న హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్టును సాగునీటి ప్రాజెక్టుగా మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. అప్పట్లోనే ఫేజ్-1కు రూ.1,305 కోట్లు, ఫేజ్-2కు రూ.1,880 కోట్లు విడుదల చేశారు. ఆయన హయాంలోనే ఫేజ్-1 పనులను పూర్తి చేశారు. ఫేజ్-2 పనులు 60శాతం మేర పూర్తి చేశారు. 2008 నుంచి ఏటా హంద్రీ-నీవా ద్వారా కృష్ణాజలాలు జిల్లాకు వస్తున్నాయి. అలాగే తుంగభద్ర ఎగువ కాలువ ప్రాజెక్టు ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. తుంగభద్ర జలాశయం నుంచి జిల్లాలోని కణేకల్లు వరకు కర్ణాటక పరిధిలో హెచ్చెల్సీ ఉంటుంది. అక్కడి నుంచి హెచ్‌ఎల్‌ఎంసీ, జీబీసీ, మిడ్‌పెన్నార్ సౌత్, నార్త్ కెనాల్ ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఇదిలా ఉంటే ఆనాడు కరువు పరిస్థితులతో తాగునీళ్లో రామచంద్రా అనే పరిస్థితులు జిల్లాలో ఉండేవి. కిలోమీటర్ల మేర దూరంలోని వ్యవసాయబోర్ల నుంచి తాగునీటిని తెచ్చుకునే వారు. నేడు జిల్లాలో శాశ్వతంగా తాగునీటి ఇబ్బందులు తొలగిపోయాయంటే అది మహానేత వైఎస్సార్ చలవే అని చెప్పుకోవాలి. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పీఏబీఆర్ రిజర్వాయర్ నుంచి శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ద్వారా ఉరవకొండ నియోజకవర్గం నుంచి హిందూపురం వరకు తాగునీటిని అందించారు. అనంతపురం నగరానికి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తాగునీటి పథకాన్ని తీసుకొచ్చారు. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారానే జిల్లాలో 60 శాతానికి పైగా జనాభాకు నేడు తాగునీటి సరఫరా జరుగుతోంది.

2019నుంచి ఇప్పటివరకు జిల్లాలో ఆరోగ్యశ్రీలో లబ్ధిపొందిన వారి వివరాలు	
ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు	2,53,466
దీనికోసం అయిన వ్యయం	రూ.542.12 కోట్లు
ఆరోగ్య ఆసరా లబ్ధిదారులు	1,19,119
దీనికోసం అయిన వ్యయం	రూ.61.058 కోట్లు
మొత్తం లబ్ధిదారులు	3,72,585
మొత్తం వ్యయం	రూ.603.178 కోట్లు

జన హృదయ నేత వైఎస్సార్

ప్రజల మనిషి వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆయన మరణించినా అందరి హృదయాల్లో సుస్థిర స్థానం ఏర్పరుచుకున్నారు. కష్ట కాలంలో రుణమాఫీతో పాటు రుణాలు సరిగా చెల్లించిన తమలాంటి వారికి చేయూతనిచ్చారు. మా కుటుంబానికి రూ.లక్ష దాకా అప్పట్లో రుణ ఉపశమనం లభించింది. కృష్ణా జలాలను అందించి కరువును పారదోలారు. ప్రతి నీటి బొట్టులోనూ వైఎస్ కనిపిస్తారు.

– మేడాపురం గాండ్ల అశ్వర్థనారాయణ, చిన్నబోయనపల్లి, కొత్తచెరువు మండలం

స్థల ఆక్రమణకు టీడీపీ నాయకుల యత్నం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



ఫిర్యాదు చేస్తున్న నగేష్‌కుమార్

నల్లచెరువు: మండల కేంద్రంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న తన స్థలాన్ని ఆక్రమించేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని పడుచూరి నగేష్ కుమార్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగేష్‌కుమార్‌కు జాతీయ రహదారి పక్కనున్న వేరుశనగ ఫ్యాక్టరీ ముందు ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలానికి రియల్ ఎస్టేట్ బ్రోకర్ అల్లాబకాష్, టీడీపీ మండల మాజీ కన్వీనర్ శివారెడ్డి, ఆయన అల్లుడు ప్రసాద్‌రెడ్డి నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించే ప్రయత్నం చేశారు. జేసీబీతో చదును చేయిస్తుండగా నగేష్‌కుమార్ అడ్డుకున్నాడు. వారం రోజుల్లో ఇక్కడ భవనం నిర్మిస్తామని, దిక్కున్న చోట చెప్పుకో అని సదరు వ్యక్తులు బెదిరించారని నగేష్ కుమార్ పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

కదిరిలో చెడ్డీగ్యాంగ్ హల్‌చల్

- 17 తులాల బంగారు, 1500 గ్రాముల వెండి చోరీ



చోరీకి పాల్పడుతున్న చెడ్డీగ్యాంగ్

కదిరి టౌన్: పట్టణంలోని నారాయణరెడ్డి కాలనీలో మధ్యప్రదేశ్‌కు చెందిన చెడ్డీగ్యాంగ్ హల్‌చల్ చేసింది. కాలనీకి చెందిన బోడెల్ల నరసారెడ్డి ఇంటిలో 17 తులాలు బంగారు, 1500 గ్రాముల వెండి చోరీ చేసింది. పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపిన వివరాలు..నరసారెడ్డి కుటుంబం ఉద్యోగరీత్యా అమెరికాలో ఉంటోంది. ఇదే అదనుగా భావించిన మధ్యప్రదేశ్‌కు చెందిన చెడ్డీ గ్యాంగ్ ఆదివారం అర్ధరాత్రి ఇంటిలో చొరబడ్డారు. ఇంటిలో ఉన్న 30 గ్రాముల బంగారు నక్లెస్, 60 గ్రాముల 4 బంగారు గాజులు, 20 గ్రాముల బంగారు డాలర్, 40 గ్రాముల మూడు జతలు కమ్మలు, 20 గ్రాముల రెండు ఉంగరాలు, 1500 గ్రాముల వెండిని ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.9.5 లక్షలు ఉంటుంది. సోమవారం ఇంటి పక్కన ఉన్న నరసారెడ్డి బంధువులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఇంటి వద్దనున్న సీసీకెమెరా ఫుటేజీ పరిశీలించగా ఐదుగురు సభ్యులున్న చెడ్డీగ్యాంగ్ చోరీకి పాల్పడినట్లు తేలింది.

తోపులాటలో వ్యక్తి మృతి

గాండ్లపెంట: బావాబామ్మర్ది మధ్య జరిగిన తోపులాటలో బావ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కురుమామిడికి చెందిన ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు మనోహర్, గుట్టకిందపల్లికి చెందిన చెన్న రంగారెడ్డి (55) వరుసకు బావాబామ్మర్దులు. సోమవారం మధ్యాహ్నం ఉపాధి హామీ బిల్లుల విషయమై ఇరువురూ వాదులాడుకున్నారు. ఇదే విషయమై రాత్రి మరోసారి గొడవపడ్డారు. ఈ క్రమంలో మనోహర్ తోయడంతో రంగారెడ్డి కిందపడ్డాడు. వెంటనే బంధువులు కదిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే రంగారెడ్డి మృతి చెందాడు. ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

వడ్డీ వ్యాపారుల దాష్టీకం

అనంతపురం: నగరంలో వడ్డీ వ్యాపారుల ఆగడాలు శ్రుతిమించాయి. వడ్డీ చెల్లింపు కాస్త ఆలస్యమైనందుకు బంగారు వ్యాపారిపై భౌతిక దాడి చేశారు. వివరాలిలా ఉన్నాయి. అనంతపురం పాతూరుకు చెందిన తిరుపాల్ వద్ద బంగారు వ్యాపారి బాబ్జాన్ రూ.2 లక్షలు అప్పు తీసుకున్నాడు. వంద రూపాయలకు నెలకు రూ.10 చొప్పున వడ్డీ చెల్లిస్తూ వచ్చాడు. ఇలా ఇప్పటిదాకా దాదాపు రూ.10 లక్షలు వడ్డీ రూపంలో చెల్లించాడు. ఈ నెల కొంచెం ఆలస్యమైంది. దీంతో తిరుపాల్, అతని కుమారులు సూరి, శేషు ముగ్గురూ కలిసి వడ్డీ సరైన సమయానికి చెల్లించకపోతే ఎలా రా అంటూ విచక్షణారహితంగా దాడి చేశారు. అక్కడే ఉన్న కొంత మంది నచ్చజెప్పేందుకు ప్రయత్నించగా..వారిపైనా దాడికి తెగబడ్డారు. దీంతో దాదాపు వంద మంది బంగారు వ్యాపారులు వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్దకు వెళ్లారు.

బీమా ప్రీమియం రైతులే చెల్లించాలి

ప్రశాంతి నిలయం: పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని రైతులే చెల్లించాలని కలెక్టర్ చేతన్ తెలిపారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద ఖరీఫ్-2025కుగాను ఎంపిక చేసిన పంటల వివరాలతో కూడిన పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ అధికారులతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దిగుబడుల ఆధారంగా పంటల బీమా కోసం కంది, వరి, మొక్కజొన్న, ఆముదం, రాగి పంటలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కంపెనీని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. నూతన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో జిల్లాలో పత్తి, వేరుశనగ, దానిమ్మ, బత్తాయి, టమాట పంటలు ఉన్నాయన్నారు. పంటల బీమా పథకంలో రైతులే ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. రైతులు బ్యాంకులో పంట రుణం తీసుకునేటప్పుడు బీమా చేయించుకోవచ్చన్నారు. పంట రుణంలో ప్రీమియం మినహాయించుకుంటారన్నారు. ఒకవేళ రైతుకు ఇష్టం లేకపోతే బీమా చేయించుకోకుండా మినహాయింపు పొందవచ్చన్నారు. ప్రీమియం మొత్తాన్ని జాతీయ పంటల బీమా పోర్టల్‌లో గానీ, మీ సేవ కేంద్రంలో గానీ నమోదు చేసుకోవచ్చన్నారు. కందికి ఎకరాకు రూ.102, వరికి రూ.200, మొక్కజొన్నకు రూ.165, ఆముదం, రాగి పంటలకు రూ.100, పత్తికి రూ.1,900, వేరుశనగకు రూ.640, దానిమ్మకు రూ.3,750, బత్తాయి పంటకు రూ.2,750, టమాటకు రూ.1,600 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు.


అగ్నిగుండం చుట్టూ పీర్లను ప్రదక్షిణ చేయిస్తున్న దృశ్యం

జలధి తరంగం


అగ్ని గుండ ప్రవేశం చేస్తున్న గూగూడు కుళ్లాయిస్వామి పీరు

భక్తజన సంద్రమైన గూగూడు

- మార్మోగిన కుళ్లాయిస్వామి నామస్మరణ
- కనుల పండువగా అగ్ని గుండ ప్రవేశం, జలధి కార్యక్రమం
- మొహర్రం వేడుకల్లో కీలకఘట్టం పరిసమాప్తం

నార్పల: గూగూడు భక్తజన సంద్రమైంది. ఇసుకేస్తే రాలనంత మందితో కిక్కిరిసిపోయింది. కుళ్లాయిస్వామి నామస్మరణతో మార్మోగింది. గూగూడు కుళ్లాయిస్వామి మొహర్రం ఉత్సవాల్లో కీలక ఘట్టమైన జలధి ఉత్సవం సోమవారం కనుల పండువగా సాగింది. మొదటగా భక్తులు స్వామివారు నడిచే అగ్నిగుండంలో నిప్పులను చదును చేశారు. ప్రధాన అర్చకుడు హుసేనప్ప స్వామి వార్లకు చక్కెర చదివింపులు చేశారు. అనంతరం సన్నాయి వాయిద్యాల నడుమ, కొబ్బరి దివిటీల వెలుగులో కొండారెడ్డి వంశస్తులు కుళ్లాయిస్వామి పీరుతో సహా తక్కిన పీర్లను ఎత్తుకుని తెల్లవారుజామున వాడవాడలా తిరుగుతూ గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు అగ్నిగుండ ప్రవేశం చేశారు. తిరిగి సాయంత్రం పీర్లను ఎత్తుకుని గ్రామ ప్రధాన వీధులలో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. చివరగా గ్రామ సమీపంలోని దిగుడుబావి వద్దకు స్వామివారి పీర్లను తీసుకెళ్లి జలధి కార్యక్రమం పూర్తి చేశారు. జలధి ఉత్సవానికి తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా దాదాపు 1,500 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


కుళ్లాయిస్వామిని శరణు వేడుతున్న భక్తులు

రేపు చివరి దర్శనం

గూగూడు కుళ్లాయిస్వామి చివరి దర్శనం బుధవారం సాయంత్రం ఆరు గంటలకు ఉంటుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి శోభ తెలిపారు.


సన్నాయి వాయిద్యాల నడుమ పీర్ల ఊరేగింపు

వృద్ధురాలి ఆస్తి వెనక్కి ఇప్పించిన ఆర్డీఓ


మనవడికి రాసిచ్చిన ఆస్తిని రద్దు చేసి వృద్ధురాలికి అందిస్తున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: నానమ్మ ఆస్తిని రాయించుకుని ఆమె బాగోగులు పట్టించుకోని మనవడితో ఆస్తి వెనక్కి ఇప్పించారు ఆర్డీఓ మహేష్. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం వృద్ధురాలికి ఆస్తి వెనక్కి ఇస్తున్నట్లు తీర్పు పత్రాలను ఆర్డీఓ మహేష్ ఆమెకు అందించారు. వివరాలు.. పట్టణంలోని కొత్తపేటకు చెందిన 70 ఏళ్ల గాజుల వెంకట లక్ష్మమ్మ భర్త గాజుల తిప్పన్న కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. ఆమె పేరు మీద ఉన్న ఇంటిని మనవడు గాజుల అనిల్‌కుమార్ పేరున గిఫ్ట్‌డీడ్‌ను చేసింది. కాని ఆమె బాగోగులు పట్టించుకోకుండా వదిలేయడంతో పింఛన్ డబ్బుతో జీవిస్తోంది. అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు మనవడిని డబ్బు అడిగినా పట్టించుకోలేదు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో గాజుల వెంకట లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు అధికారులు అనిల్‌కుమార్‌కు మూడుసార్లు నోటీసులు ఇచ్చినా పట్టించుకోలేదు. దీంతో సీనియర్ సిటిజన్ నిర్వహణ సంక్షేమ చట్టం 2007 కింద ఆమె మనవడికి ఇచ్చిన గిఫ్ట్‌డీడ్‌ను రద్దు పరుస్తూ ఆదేశాలు ఇచ్చినట్లు ఆర్డీఓ తెలిపారు.

అర్జీలపై అలసత్వం వహిస్తే చర్యలు


అర్జీ స్వీకరిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీ రత్న పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 55 మందితో అర్జీలు స్వీకరించారు. సమస్యలపై ఎస్పీ నేరుగా పోలీస్ అధికారులతో మాట్లాడారు. ఫిర్యాదులో ఉన్న అంశాలను పరిశీలించి వాటి పూర్వాపరాలపై విచారణ చేసి చట్ట పరిధిలో తక్షణమే పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీలు విజయ కుమార్, ఆదినారాయణ, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఎస్పీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమానికి అనుమతివ్వండి..

రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ,ఎస్టీ బీసీ మైనార్టీలపై జరుగుతున్న దాడులను, వారి సమస్యలను కలెక్టర్‌కు తెలియజేసేందుకు ఈనెల 14న జిల్లా కేంద్రం పుట్టపర్తిలో నిరసన కార్యక్రమం తలపెట్టామని, ఇందుకు అనుమతి ఇవ్వాలని జిల్లా ఎస్పీని ఎస్సీ జనసంఘ జాతీయ అధ్యక్షులు దానసగారిపల్లి కుళ్లాయప్ప కోరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ బీసీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి దాడులు చేస్తున్నారు. అనంతపురం ఆలుమూరు గ్రామంలో దళితుల భూమిని ఆక్రమిస్తే కొంత మంది దళితులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. మరికొంత మంది బీసీ, మైనార్టీలు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. పుట్టపర్తిలో జర్నలిస్ట్ డాక్యుమెంట్ తయారు చేస్తే దాడి చేసి కేసులు పెట్టారన్నారు. ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ భూమిని ఆక్రమించడమే గాక బీసీ నేతను అణగదొక్కేలా ఆయనపై అక్రమ కేసులు బనాయించారన్నారు. ఈదాడులపై ఈనెల 10న సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. బీసీ సమన్వయ కమిటీ జిల్లా అధ్యక్షులు సాకే ఆదినారాయణ, జైభీమ్ రామాంజనేయలు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ ప్రారంభం

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో సత్యసాయి విద్యా సంస్థలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, మానవతా విలువలు అన్న అంశంపై శిక్షణ ఇస్తున్నారు. నందగిరి, ప్రశాంతి నిలయం, అనంతపురం, బృందావన్ క్యాంపస్ విద్యార్థులు హాజరయ్యారు. సోమవారం సాయంత్రం ప్రశాంతి నిలయం క్యాంపస్ విద్యార్థులు రామకథ పేరుతో ఆధ్యాత్మిక సంగీత విభావరి నిర్వహించారు.

ప్రశాంతి నిలయంలో గ్లోబల్ మెడికల్ క్యాంప్

ప్రశాంతి నిలయంలో భక్తులకు ఆరోగ్య సేవలను అందించే లక్ష్యంతో సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గ్లోబల్ మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. సోమవారం నార్త్ బిల్డింగ్ వద్ద ఏర్పాటు చేసిన క్యాంప్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు ప్రారంభించారు. ఈనెల 11 వరకు క్యాంప్ నిర్వహించనున్నారు.

మా భూమిలోకి పోకుండా అడ్డుకుంటున్నారు

- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జవాన్ ఫిర్యాదు


సీఆర్‌పీఎఫ్ జవాన్ చెన్నారెడ్డి

ప్రశాంతి నిలయం: తాము కొనుగోలు చేసిన వ్యవసాయ భూమిలోకి వెళ్లకుండా కొందరు అడ్డుకుంటున్నారని సీఆర్‌పీఎఫ్ జవాన్ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. కనగానపల్లి మండలం కుర్లపల్లికి చెందిన వై.చెన్నారెడ్డి ఒడిశాలోని రాయ్‌ఘడ్‌లో సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా పనిచేస్తున్నారు. ఆయన 2012లో కుర్లపల్లి గ్రామం సర్వేనంబర్ 248-4బీలో 5.16 ఎకరాల భూమిని బంధువుల వద్ద నుంచి కొనుగోలు చేశారు. అయితే కొందరు వ్యక్తులు ఆ భూమిలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. దీంతో జవాన్ 2017లో కోర్టులో పిటిషన్ వేసి.. ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారు. అప్పటి నుంచి మూడేళ్లపాటు పంటలు సాగు చేశారు. 2021లో మళ్లీ ఆ భూమిని సాగు చేయకుండా దౌర్జన్యపరులు అడ్డుకున్నారు. దీంతో పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దేశ రక్షణ కోసం పోరాడుతున్న తమ భూమికే గ్రామంలో రక్షణ లేకపోతే ఎలా అని జవాన్ చెన్నారెడ్డి సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

అర్జీలు సరే.. పరిష్కారమేదీ?

- సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదంటున్న బాధితులు
- ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేదంటున్న వైనం
- అధికారుల తీరుపై బాధితుల అసంతృప్తి

ప్రశాంతి నిలయం: ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కుటమి ప్రభుత్వం చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక సరైన పరిష్కారం చూపడం లేదని అర్జీదారులు వాపోతున్నారు. వారాల తరబడి కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలు ఇచ్చుకుంటున్నా సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. తమకు పరిష్కారం చూపకనే పరిష్కరించామని రికార్డులో నమోదు చేసుకుని చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐదు వారాలుగా తిరుగుతున్నా..



నాకు ఎనుములపల్లి రెవెన్యూ గ్రామ సర్వే నంబర్ 465-2లో ఐదు ఎకరాల పొలం ఉంది. నా పక్కనే ఉన్న మరోవ్యక్తి నరా పొలంలోని కొంత భాగాన్ని దౌర్జన్యంగా ఆక్రమించి దారి చేసుకున్నాడు. దీనిపై ఐదు వారాలుగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు ఇస్తూనే ఉన్నా పరిష్కారం కావడం లేదు. ఎంకా ఎన్ని రోజులకు నా సమస్యల పరిష్కారం అవుతుందో అర్థం కావడం లేదు.
– రామచంద్ర, గోకులం

పరిష్కారమైనట్లు రికార్డులో నమోదు చేశారు..



కప్పలబండ గ్రామ పంచాయతీలో సర్పంచ్‌తో పాటు అధికారులు కుమ్మక్కై పంచాయతీ సొమ్ము సుమారు రూ.60 లక్షల పైబడి స్వాహా చేశారని, ఏడు వారాలుగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు ఇస్తూనే ఉన్నాం. అయినా చర్యలు తీసుకోలేదు. కానీ అధికారులు మాత్రం సమస్య పరిష్కారం అయినట్లు రికార్డులో నమోదు చేసుకున్నారు.
– ఏకిల శేఖర్, కప్పలబండ

సమస్యలు పరిష్కారం కావడం లేదు



మాకు బుక్కపట్నం మండలం అగ్రహారం రెవెన్యూ గ్రామ పరిధిలోని రాశింపల్లికి గ్రామంలోని మా పొలాలకు 1982 నుంచి దారి ఉంది. అయితే ఆ దారిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మూసి వేసి తమ పొలాలకు వెళ్లకుండా అడ్డుకుంటున్నాడు. దీనిపై గతంలో తహసీల్దార్‌కు గ్రీవెన్స్‌లో అర్జీలు ఇచ్చినా పరిష్కారం కాకపోవడంలో చేసేది లేక కలెక్టరేట్‌కు వచ్చామని రైతులు సత్యనారాయణ రాజు, గంగమ్మ, పుల్లమ్మ, గురుస్వామి, కుమ్మర సుబ్రమణ్యంలు వాపోయారు.
– సత్యనారాయణ రాజు, రాశింపల్లి, బుక్కపట్నం

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపండి

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే అర్జీల పట్ల నిర్లక్ష్యం వహించకుండా వెంటనే నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక మందిరంలో కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇల్లు, ఇంటి పట్టాలు, సామాజిక పింఛన్లు, భూ సమస్యలు తదితర అంశాలపై 172 అర్జీలు వచ్చాయి. పుట్టపర్తి డివిజన్ నుంచి 60, పెనుకొండ 44, ధర్మవరం 41, కదిరి నుండి 27 వినతులు అందాయి. అనంతరం జాయింట్ కలెక్టర్ అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. పెండింగ్, బియాండ్ ఎస్ఎల్ఏ, రీ ఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. డీఆర్ఓ విజయ సారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణ రెడ్డి, రామసుబ్బయ్య, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి


పూజలందుకున్న ఆంజనేయస్వామి

వైభవంగా భూతప్ప ఉత్సవాలు

మడకశిరరూరల్: ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద సోమవారం మినీ భూతప్ప ఉత్సవాలు వైభవంగా జరిగాయి. తొలుత లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజినేయస్వామి ఆలయాల్లో భక్తులు ఉపవాస దీక్ష, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, సంతానం లేని మహిళలు తడిస్నానం చేసి భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద వారపడ్డారు. స్వామివారి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకువస్తూ భూతప్పలు భక్తులపై కాలుమోపుతూ ఆలయానికి చేరుకున్నారు. భూతప్పలు కాలుమోపిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూతప్పల స్పర్శ కోసం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి తరలివచ్చారు. భక్తులకు దాతలు ప్రసాద వినియోగం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.




స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం, భక్తులపై కాలుమోపుతూ ముందుకు వస్తున్న భూతప్పలు

అంబేడ్కర్ స్మృతివనం ప్రైవేటీకరణపై ఆగ్రహం

- అంబేడ్కర్ సర్కిల్ వద్ద దళిత సంఘాల ఆందోళన


జీఓ ప్రతులను దహనం చేస్తున్న దళిత నాయకులు

మడకశిర: విజయవాడలోని అంబేడ్కర్ స్మృతి వనాన్ని ప్రైవేట్ పరం చేస్తూ కూటమి ప్రభుత్వం జీఓ జారీ చేయడంపై దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మడకశిరలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో వివిధ దళిత సంఘాల నేతలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జీఓ ప్రతులను దహనం చేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు హనుమంతు మాట్లాడుతూ వైఎస్‌జగన్ హయాంలో రూ.కోట్లు వెచ్చించి అంబేడ్కర్ స్మృతి వనం ఏర్పాటు చేశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం స్మృతి వనాన్ని ప్రైవేట్‌పరం చేయడం దళితులకు ద్రోహం చేయడమేనని విమర్శించారు. ప్రభుత్వ ఆధీనంలోనే స్మృతి వనాన్ని నిర్వహించాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు శివన్న, క్రిష్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు నరసింహ, బూత్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జునగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మంజునాథ్, మైనార్టీ సెల్ కార్యదర్శి సికిందర్, పట్టణ వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షులు గోపి, వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు ధను, నగేష్, బీసీ సెల్ కార్యదర్శి సత్యనారాయణ, సర్పంచులు రంగనాథ్, హనుమంతప్ప, టీడీపల్లి రంగనాథ్, అంజినప్ప, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక యువకుడి ఆత్మహత్య

చిలమత్తూరు: ఒంటరితనం భరించలేక ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. వీరాపురం గ్రామానికి చెందిన జయవర్ధన్(28)రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే భార్య వదిలేసి వెళ్లిపోయింది. అప్పటి నుండి తండ్రి, అన్నలతో కలిసి ఉంటున్నాడు. అయితే ఒంటరితనం భరించలేక సోమవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసున్నట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు.